



తెలుగు జాతీయ దినపత్రిక

# అక్షర విజేత

నిజం నిర్భయం నిష్పక్షం

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక






సంపుటి :04 సంచిక : 339 ఆంధ్ర ప్రదేశ్ సంపాదకులు బి .అనిల్ కుమార్ గురువారం జులై 03 2025 పేజీలు 06


## విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి

# వికాసం వైపు నడిపిస్తున్నాం

-కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన

-దేశంలోనే కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని స్పష్టీకరణ

-ఈ ఏడాదిలోనే కుప్పం చివరి ఆయకట్టుకు హంద్రీనీవా జలాలు

-స్వర్ణ కుప్పం ప్రాజెక్టు కింద రూ. 1292 కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభం

-అభివృద్ధి ద్వారా వచ్చిన ఆదాయంతోనే సంక్షేమం అమలు చేస్తామన్న చంద్రబాబు

2



తన నియోజకవర్గమైన కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. బుధవారం నాడు కుప్పంలో పర్యటించిన ఆయన, 'స్వర్ణ కుప్పం' ప్రాజెక్టులో భాగంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడుతూ, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నామని స్పష్టం చేశారు.కుప్పం నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నమైన హంద్రీనీవా నీళ్లను ఈ ఏడాదిలోనే అందిస్తామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. రూ. 3,890 కోట్ల వ్యయంతో హంద్రీనీవా పనులను పూర్తి చేసి, నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారిస్తామని తెలిపారు.



## వైసీపీ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తోంది

-చిల్లర రాజకీయాలతో పాదయాత్ర చేస్తే జనం చెప్పులతో కొడతారన్న శబరి

2

-కదిరిలో సీబీఐ దాడులపై వైసీపీ సమాధానం చెప్పాలన్న ఎమ్మెల్యే కందికుంట

## కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది



ఏపీలో లక్ష ఫామ్ పాండ్స్ నిర్మాణం పూర్తి..

రైతులకు అండగా నిలుస్తాం

: పవన్ కల్యాణ్

-లక్ష వ్యవసాయ కుంటలను రైతులకు అందుబాటులోకి తెచ్చామన్న పవన్

-రైతుల సహకారంతోనే ఇది సాధ్యమయిందని ప్రశంస

2

## ఉనికి కోసం హరీశ్ రావు బనకచర్ల గురించి మాట్లాడుతున్నారు

బీఆర్ఎస్ లో అంతర్గత పోరు ఉందన్న పయ్యావుల

అనవసర వివాదాలు సృష్టించవద్దని హితవు



2

### బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు

## ఆరు నెలల జైలు శిక్ష

-కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్ తీర్పు

-గతేడాది దేశం విడిచి వెళ్లిన తర్వాత హసీనాకు ఇదే తొలి శిక్ష

-మానవ హననం కేసులోనూ తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న హసీనా

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హసీనాకు కోర్టు ధిక్కరణ కేసులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆమెను దోషిగా తేల్చిన బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ (ఐసీటీ), బుధవారం ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దాదాపు ఏడాది క్రితం దేశంలో తీవ్ర నిరసనల మధ్య ఆమె ప్రభుత్వం కూలిపోయి, దేశం విడిచి వెళ్లిన తర్వాత ఒక కేసులో ఆమెకు శిక్ష పడటం ఇదే మొదటిసారి.ఢాకా ట్రిబ్యూన్ పత్రిక కథనం ప్రకారం, జస్టిస్ ఎండీ గోలాం మొర్తజా మొజుందర్ నేతృత్వంలోని అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్-1కు చెందిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ సంచలన తీర్పును వెలువరించింది

2



## దమ్ముంటే ప్రజల్లోకి రండి: బొండా ఉమ

2



### ప్రభుత్వ ఆసుపత్రుల్లో

# కార్పొరేట్ వైద్యులు సేవలు అందించాలి!

-కార్పొరేట్ వైద్యులు నెలకు ఒకసారైనా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవ చేయాలని విజ్ఞప్తి

కార్పొరేట్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు తమ సామాజిక బాధ్యతగా ఏడాదికి కనీసం ఒక నెల రోజుల పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిరుపేదలకు సేవలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. సామాన్య ప్రజలకు సేవ చేయడం ద్వారా వైద్య వృత్తిలో గొప్ప అనుభూతి, ఆత్మ సంతృప్తి లభిస్తాయని ఆయన అన్నారు.బుధవారం నాడు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆసుపత్రి నూతన విభాగాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రికి వెళితే ప్రాణాలు పోతాయనే అపోహను ప్రజల నుంచి తొలగించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

2



## నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం...

-దేశం దాటిస్తాం: ట్రంప్



2

# కేంద్రం నుంచి సంపూర్ణ సహకారం అందుతోంది

రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఫామ్ పాండ్స్ (వ్యవసాయ కుంటలు) నిర్మాణం పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ వ్యవసాయ కుంటలు కరవు పరిస్థితుల్లో కూడా రైతులకు ఆసరాగా నిలుస్తాయని పవన్ పేర్కొన్నారు. వీటి నిర్మాణం ద్వారా నిస్సారమైన భూములకు సైతం జీవం పోయవచ్చని, భూగర్భ జలాల మట్టం పెరగడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. ఈ ఫామ్ పాండ్స్ వల్ల ఇప్పటివరకు సుమారు 1 టీఎంసీ నీటిని నిల్వ చేసే సామర్థ్యం పెరిగిందని, అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ శ్రామికులకు పని కల్పించినట్టు అయిందని ఆయన తెలిపారు.

రైతుల సహకారంతోనే ఈ బృహత్కార్యం సాధ్యమైందని పవన్ అన్నారు. వ్యవసాయ కుంటల ఆవశ్యకతను గ్రహించి, తమ పొలాల్లో వాటిని తవ్వించుకోవడానికి ముందుకు వచ్చిన రైతులందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, ఈ యజ్ఞంలో పాలుపంచుకున్న గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి మొదలుకొని క్షేత్రస్థాయి సహాయకుల వరకు సిబ్బందికి, ఉపాధి హామీ కూలీలకు ఆయన పేరుపేరునా అభినందనలు తెలియజేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం అందుతోందని పవన్ పేర్కొన్నారు. ఇందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యులు సేవలు అందించాలి!

ఇందులో భాగంగా కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. వందేళ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా ఆసుపత్రికి 30 ఎకరాల స్థలంలో రూ. 3 వేల కోట్ల వ్యయంతో అధునాతన భవనాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. అలాగే, నిమ్స్‌లో మరో 2 వేల పడకల విభాగాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. వీటితో పాటు వరంగల్, అల్వాల్, ఎల్‌బీ నగర్, సనత్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఆసుపత్రులతో కలిపి వచ్చే డిసెంబర్ 9 నాటికి రాష్ట్రంలో కొత్తగా 7 వేల పడకలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

**కొత్త వేదిక ఏర్పాటుకు సూచన**

కార్పొరేట్ రంగంలో, విదేశాల్లో స్థిరపడిన వైద్యులు రాష్ట్రంలో సేవలు అందించాలనుకున్నా, అందుకు సరైన వేదిక లేదని ముఖ్యమంత్రి అన్నారు. "అమెరికాలో స్థిరపడిన మన రాష్ట్ర వైద్యులు ఇక్కడికి వచ్చినప్పుడు వారి సేవలను వినియోగించుకోవడానికి ప్రస్తుతం ఒక ప్లాట్‌ఫామ్ లేదు. అలాంటి వారికోసం ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించాం" అని ఆయన తెలిపారు. ఈ వేదిక ద్వారా కార్పొరేట్ వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రులతో అనుసంధానమై పేదలకు సేవ చేసే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

**ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత**

ప్రజలపై వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు తాము అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 2 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద ఇప్పటివరకు రూ. 1,400 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామన్నారు. విద్య, వైద్య రంగాలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ. 11,500 కోట్లు, విద్యారంగానికి రూ. 21 వేల కోట్లు కేటాయించామని వివరించారు.

**మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల్లో ఉన్న కోటి మంది మహిళల ఆరోగ్య వివరాలతో హెల్త్ ప్రొఫైల్స్ తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మహిళల్లో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, నివారణ చర్యల్లో భాగంగా వారందరికీ ప్రత్యేక ఐడీ నంబర్‌తో కూడిన హెల్త్ కార్డులు జారీ చేస్తామని అన్నారు.

క్యాన్సర్ చికిత్సలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌లో ఆరోగ్య రంగానికి ఒక ప్రత్యేక అధ్యాయాన్ని కేటాయించామని, డాక్టర్ నాగేశ్వర రెడ్డి వంటి నిపుణుల భాగస్వామ్యం కూడా తీసుకుంటామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఏఐజీ ఆసుపత్రి సేవలను ముఖ్యమంత్రి అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా 65 దేశాల నుంచి రోగులు చికిత్స కోసం ఏఐజీకి రావడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. మన నర్సులకు జపాన్‌లో మంచి డిమాండ్ ఉన్నందున, వారికి జపనీస్ భాషలో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

# నేరాలు చేస్తే అమెరికా పౌరులైనా వదలం... దేశం దాటిస్తాం: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. తీవ్రమైన నేరాలకు పాల్పడే అమెరికా పౌరులను కూడా దేశం నుంచి బహిష్కరించాలనే కొత్త ఆలోచనను ఆయన తాజాగా బయటపెట్టారు. అయితే, ఈ ప్రతిపాదన రాజ్యాంగ విరుద్ధమయ్యే అవకాశం ఉందని న్యాయ నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫ్లోరిడా ఎవర్గ్లేడ్స్‌లోని వలసదారుల నిర్బంధ కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ట్రంప్ విలేకరులతో మాట్లాడారు. అమెరికా పౌరసత్వం పొందిన కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. "వారు మన దేశానికి కొత్త కాదు, చాలా కాలంగా ఇక్కడే ఉంటున్నారు. వారిలో చాలామంది ఇక్కడే పుట్టారు. నిజం చెప్పాలంటే, వాళ్లను కూడా ఇక్కడి నుంచి తరిమికొట్టాలని నేను భావిస్తున్నాను. బహుశా ఇదే మా తదుపరి పని కావచ్చు" అని ఏబీసీ న్యూస్ కథనం ప్రకారం ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే, తన ప్రతిపాదనకు చట్టపరమైన వెసులుబాటు ఉందో లేదో తనకు కచ్చితంగా తెలియదని ట్రంప్ అంగీకరించడం గమనార్హం. "చట్టపరంగా మాకు ఆ హక్కు ఉందో లేదో తెలుసుకోవాలి. ఒకవేళ ఆ అధికారం ఉంటే మాత్రం, ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఆ పని చేస్తాను. ప్రస్తుతం దానిపైనే మేం దృష్టి సారించాం" అని ఆయన స్పష్టం చేశారు. ట్రంప్ వ్యాఖ్యలకు కొన్ని వారాల ముందే, ఆయన నియమించిన సహాయ అటార్నీ జనరల్ బ్రెట్ షుమేట్ ఒక మెమో జారీ చేశారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఉన్న కేసుల్లో పౌరసత్వం రద్దు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన యూఎస్ అటార్నీలను ప్రోత్సహించారు. ముఖ్యంగా వేధింపులు, యుద్ధ నేరాలు, మానవ అక్రమ రవాణా, మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడిన వారిని లక్ష్యంగా చేసుకోవాలని ఆ మెమోలో పేర్కొన్నారు. మరోవైపు, నేరాలకు పాల్పడ్డారనే కారణంతో, అమెరికా గడ్డపై సహజంగా జన్మించిన లేదా సహజ పౌరసత్వం పొందిన వారిని దేశం నుంచి బహిష్కరించడం రాజ్యాంగంలోని ఎనిమిదో సవరణను ఉల్లంఘించడమే అవుతుందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్రూరమైన, అసాధారణ శిక్షలను ఈ సవరణ నిషేధిస్తుందని వారు గుర్తు చేస్తున్నారు. వర్జీనియా యూనివర్సిటీకి చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ అమండా ఫ్రాస్ట్ మాట్లాడుతూ, "పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసానికి పాల్పడటం లేదా దేశద్రోహం వంటి నిర్దిష్ట సందర్భాల్లో మాత్రమే సహజ పౌరుల హోదాను రద్దు చేయగలరు. అంతేకానీ, సంబంధం లేని నేరాలను కారణంగా చూపి ఒకరి పౌరసత్వాన్ని రద్దు చేసి, వారిని దేశం నుంచి బహిష్కరించడం కుదరదు" అని ఏబీసీ న్యూస్‌కు వివరించారు. ట్రంప్ సందర్శించిన ఈ నిర్బంధ కేంద్రాన్ని, కఠిన వలస విధానాల కారణంగా విమర్శకులు 'అలిగేటర్ అల్కాట్రాజ్' అని పిలుస్తుండగా, ట్రంప్ మాత్రం ఆ వివాదాన్ని పట్టించుకోకుండా తన పర్యటనను పూర్తి చేశారు.

# గుడ్లూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రారంభించిన కూటమి నాయకులు

గుడ్లూరు,

ఉమ్మడి ప్రకాశం జిల్లా కందుకూరు నియోజకవర్గం గుడ్లూరు మండల కేంద్రము లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కందుకూరు కూటమి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాలు మేరకు మండల టిడిపి అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు ఆద్వర్యంలో కూటమి నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంను లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా మండల టిడిపి అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు తన సందేశాన్ని ఇస్తూ మా కందుకూరు అభివృద్ధి ప్రదాత ప్రజా సంక్షేమం కోసం నిరంతరం తపించే మన మంచి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆశయాలు లక్ష్యాలు కొనసాగేలా ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను అందించే భాద్యత కూటమి ప్రభుత్వం తరఫున ఖచ్చితంగా అమలు చేస్తాం. గత వైకాపా ప్రభుత్వ కాలంలో కేవలం బటన్ నొక్కుడు పేరుతో పప్పు బెల్లాలు కొంతమంది కి చేర్చారే గానీ ప్రజలందరికీ న్యాయం ఏమాత్రం జరుగక పోవడమే కాకుండా అభివృద్ధి ఊసే లేదు. నేడు అలాకాకుండా ఒక విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో నిజాయితీకి మారుపేరైన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దేశ అభివృద్ధి ప్రదాత నరేంద్రమోడీ ఉత్తమ కలయిక వల్ల ప్రజలందరి దీవెనలతో మంచి ప్రభుత్వం ఏర్పాటు



చేసుకున్నాం. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటి గా ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నాం. ఇటీవల సరైన సమయంలో తల్లికి వందనం పేరుతో ఇంట్లో చదువుకునే ప్రతి బిడ్డకు లబ్ధి చేకూరింది. ఇలా ప్రతి ప్రభుత్వ పథకం అర్హులైన లబ్ధిదారులకు అందేలా కూటమి ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామని నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు జొన్నలగడ్డ రమణమ్మ గ్రామ సర్పంచ్ పాలకీర్తి శంకర్ మండల జనసేన నాయకులు మూలగిరి శ్రీనివాస్ అన్నంగి చలపతి బిజెపి మండల అధ్యక్షుడు ఇన్నమూరి ప్రమీల సుధాకర్ గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఉన్నం వెంకటేశ్వర్లు , పువ్వాడి వేణు ,రావూరి వేణు , దామా వెంకటేశ్వర్లు,మేకపోతుల రాఘవయ్య , ఉమ్మనేని సుబ్బారావు, మేకల మాల్యాద్రి తదితర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

# విధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి వికాసం వైపు నడిపిస్తున్నాం

"అభివృద్ధి చేసే వారికే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుంది. అప్పులు తెచ్చి సంక్షేమం చేస్తామనడం సరైన పరిపాలన కాదు," అని ఆయన అన్నారు. అభివృద్ధి ద్వారా ఆదాయాన్ని సృష్టించి, దానిని సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడమే సరైన ఆర్థిక విధానమని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం గత ఏడాదిగా ఇదే పాలసీని అనుసరిస్తోందని వివరించారు. 'స్వర్ణ కుప్పం' ప్రాజెక్టు కింద నియోజకవర్గంలో మొత్తం రూ. 1292 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే రూ. 125 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నియోజకవర్గంలోని రహదారులన్నింటినీ సీసీ, బీటీ రోడ్లుగా మార్చనున్నామని, రాష్ట్రవ్యాప్తంగా గుంతలు లేని రహదారులను నిర్మించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతోనే ఏడాదిగా సుపరిపాలన అందిస్తున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మహిళల కోసం 'దీపం 2.0' పథకాన్ని ప్రస్తావించారు. గతంలో తాము ప్రవేశపెట్టిన 'దీపం' పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు అందిస్తే, ఇప్పుడు 'దీపం 2.0' ద్వారా అర్హులైన మహిళలందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని చెప్పారు. దీనివల్ల కుప్పం నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలోనూ వంట గ్యాస్ అందుబాటులోకి వచ్చిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. సుపరిపాలనలో భాగంగానే ప్రజల ముందుకు వచ్చానని, ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

# వైసీపీ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తోంది

వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్.. వైసీపీ విధానాలపై, జగన్‌పై వేర్వేరు కార్యక్రమాల్లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఎంపీ బైరెడ్డి శబరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ రౌడీ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. "గడిచిన ఐదేళ్లలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలి. అది చేయకుండా చిల్లర రాజకీయాలతో పాదయాత్ర అంటూ వస్తే ప్రజలే చెప్పులతో కొడతారు" అని జగన్‌ను ఉద్దేశించి తీవ్రంగా హెచ్చరించారు. జగన్ ఐదేళ్ల పాలనలో చేయలేని అభివృద్ధిని, తమ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే చేసి చూపించిందని శబరి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నామని, ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కూడా పాల్గొన్నారు. మరోవైపు, శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కూడా వైసీపీపై విమర్శలు చేశారు. స్థానికంగా జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, కదిరిలో వైసీపీ నేతలపై జరుగుతున్న సీబీఐ దాడుల గురించి ప్రస్తావించారు. "దేశవ్యాప్తంగా 33 ప్రాంతాల్లో సీబీఐ సోదాలు చేస్తుంటే, అందులో కదిరి వైసీపీ నేతలు ఉండటం సిగ్గుచేటు" అని ఆయన ఎద్దేవా చేశారు.

# బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆరు నెలల జైలు శిక్ష

. ఇదే కేసులో సంబంధం ఉన్న గైబంధా ప్రాంతానికి చెందిన షకీల్ ఆకంద్ బుల్బుల్‌కు కూడా రెండు నెలల జైలు శిక్ష విధించినట్లు ట్రైబ్యునల్ స్పష్టం చేసింది. షేక్ హసీనా ప్రస్తుతం కేవలం కోర్టు ధిక్కరణ కేసులోనే కాకుండా, అంతకంటే తీవ్రమైన ఆరోపణలను కూడా ఎదుర్కొంటున్నారు. గత ఏడాది తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన భారీ నిరసనల సమయంలో అమానవీయ రీతిలో నేరాలకు పాల్పడ్డారంటూ ఆమెపై అధికారికంగా అభియోగాలు నమోదయ్యాయి. నిరసనకారులపై షేక్ హసీనా 'పద్ధతి ప్రకారం దాడులు' చేయించారని ఐసీటీ చీఫ్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ తాజుల్ ఇస్లాం ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కార్యాలయం నివేదిక ప్రకారం, 2024 జూలై 15 నుంచి ఆగస్టు 15 మధ్య జరిగిన ఆ హింసాత్మక ఘటనల్లో సుమారు 1,400 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అంచనా. అయితే, తనపై మోపిన అన్ని ఆరోపణలను షేక్ హసీనా మొదటి నుంచి ఖండిస్తూ వస్తున్నారు. ఈ ఆరోపణలపై వాదనలు వినిపిస్తామని ఆమె తరఫు న్యాయవాది అమీర్ హుస్సేన్ మీడియాకు తెలిపారు. 2024 ఆగస్టులో దేశవ్యాప్త ఆందోళనలతో అవామీ లీగ్ ప్రభుత్వం అనూహ్యంగా కూలిపోవడంతో షేక్ హసీనా బంగ్లాదేశ్ విడిచిపెట్టి భారతదేశానికి చేరుకున్నట్టు కథనాలు వచ్చాయి.

# ఉనికి కోసం హరీశ్ రావు బనకచర్ల గురించి మాట్లాడుతున్నారు.

బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని బీఆర్ఎస్ కేవలం రాజకీయ లబ్ధి కోసమే తెరపైకి తెచ్చిందని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ లో నెలకొన్న అంతర్గత పోరులో భాగంగానే కొందరు నేతలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ఈ వివాదాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. అనంతపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

బనకచర్ల ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చేస్తున్న విమర్శల వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని పయ్యావుల అన్నారు. "బీఆర్ఎస్ లో అంతర్గత సమస్యలు నడుస్తున్నాయి. అందులో భాగంగానే హరీశ్ రావు తన ఉనికిని చాటుకోవడానికి బనకచర్ల అంశాన్ని వాడుకుంటున్నారు. ఇది పూర్తిగా ఆయన సృష్టిస్తున్న రాజకీయ డ్రామా. మిగతా నేతలు కూడా ఆయన ట్రాప్‌లో పడి మాట్లాడుతున్నారు" అని పయ్యావుల వివరించారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్కడా స్పందించకపోవడాన్ని ఆయన ప్రస్తావిస్తూ, ఇది వారి అంతర్గత గొడవేనని స్పష్టం చేశారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి ఎలాంటి నష్టమూ వాటిల్లదని మంత్రి పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. "కిందకు వృథాగా పోయే నీటిని మాత్రమే వాడుకుంటున్నాం. దీనివల్ల ఎగువ రాష్ట్రాలకు ఏమాత్రం ఇబ్బంది ఉండదు. ఈ విషయం తెలిసి కూడా కేవలం రాజకీయ ఉద్దేశాలతోనే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారు" అని ఆయన అన్నారు.

గతంలో తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను కూడా పయ్యావుల ఈ సందర్భంగా గుర్తుచేశారు. "రాయలసీమకు గోదావరి జలాలు రావాలని గతంలో కేసీఆర్ స్వయంగా చెప్పలేదా?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇప్పుడు ఆయన పార్టీ నేతలే అందుకు విరుద్ధంగా మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పయ్యావుల విమర్శించారు. అనవసర వివాదాలు సృష్టించి రెండు రాష్ట్రాల మధ్య అపోహలు పెంచవద్దని ఆయన హితవు పలికారు.

# ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

## -మీడియా సమావేశం నిర్వహించిన అర్బన్ సీఐ రమేష్

అక్షర విజేత చిలకలూరిపేట

చిలకలూరుపేట పట్టణం మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో జరిగిన ద్విచక్ర వాహనాల దొంగతనాలకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపిన అర్బన్ సీఐ రమేష్ తెలిపారు.

లఅర్బన్ సీఐ రమేష్ చెప్పిన వివరాల ప్రకారం ల వాహనాలు తనిఖీ చేస్తుండగా, ముగ్గురు వ్యక్తులు ఒక స్కూటీపై అనుమానాస్పదంగా వెళ్తూ కనిపించారు. పోలీసులు వారిని పట్టుకుని విచారించగా, వారి పేర్లు పోలాస్ ఉదయకిరణ్ (పురుషోత్తంపట్నం), కొడవతు జశ్వంత్ నాయక్, మరియు కొడవతు బాలస్వామి నాయక్ (వీరిద్దరూ చిలకలూరుపేట టౌన్, సుగాలి కాలనీకి చెందినవారు) అని తెలిసింది. వీరు ముగ్గురు చెడు అలవాట్లకు బానిసలై, మద్యం మరియు గంజాయి తాగడం వంటి వ్యసనాలకు డబ్బుల కోసం ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారని విచారణలో వెల్లడైంది. చిలకలూరుపేట టౌన్, వెలకాని, తెనాలి ప్రాంతాల్లో సుమారు 11 ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు వారు ఒప్పుకున్నారు. అందులో చిలకలూరుపేటకు చెందిన 6 స్కూటీలు, ఒక బుల్లెట్, ఒక ఎన్ఎస్ బైక్, ఒక ఎంటీ బైక్ ఉన్నాయి. తెనాలికి చెందిన ఒక స్కూటీ, వెలకాని కి చెందిన ఒక బుల్లెట్ ను కూడా దొంగిలించారు.

దొంగిలించిన వాహనాలను నరసరావుపేట రోడ్డులోని దబ్బలగూడెం దగ్గర ఒక ముళ్ళపొదల ప్రదేశంలో దాచి, అవసరమైనప్పుడు ఒక్కొక్కటిగా అమ్ముతున్నారని పోలీసులు తెలిపారు. పోలీసులు ఈ 11 బైకులను రికవరీ చేశారు. చివరగా, చిలకలూరిపేట అర్బన్ సిఐ రమేష్ ప్రజలకు ఒక విజ్ఞప్తి చేశారు. నేరాలు జరగకుండా నివారించడానికి మరియు దొంగతనాలను గుర్తించడానికి సీసీ కెమెరాలు చాలా ముఖ్యమని, కాబట్టి ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. పట్టణంలో ఇప్పటికే దాదాపు





800 సీసీ కెమెరాలు ఉన్నాయని, ప్రజల సహకారంతో మరింత మంది పెట్టుకుంటే నేరాలను నియంత్రించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సై చెన్నకేశవులు, ఎస్సై రహమతుల్లా, ఎస్సై హాజరత్తయ్య, పలువురు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పదవీ విరమణ సభలో జంపాల సీతారామయ్య

అక్షర విజేత మైలవరం ప్రతినిధి



ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంబిడాక్టర్ ఎన్ టి టి పి ఎస్ లో సుదీర్ఘకాలం పనిచేసి పదవి విరమణ పొందిన మైనార్టీ నాయకులు మరియు కౌన్సిలర్ షేక్ రసూల్ తండ్రి షేక్ బడేమియా పదవి విరమణ సభలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మరియు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య. ఈ సందర్భంగా బడేమియా దంపతులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మాన సభలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల కోసం పోరాటం చేస్తూ, అందరితో ఆత్మీయంగా ఉండేవారిని, అలాంటివారు పదవీ విరమణ పొందటం ఆయన లోటు తీర్చలేదని అన్నారు. ఆయన దారిలోనే ఆయన కుమారుడు రసూల్ కౌన్సిలర్, ప్రజలకు సేవ చేస్తూ ఉండటం అభినందనీయమని తెలిపారు.

# సబ్ జైలు మరియు పెట్రోల్ బంక్ లను ప్రారంభించిన హెూం శాఖ మంత్రి అనిత, ప్రభుత్వ విప్ దివ్య లు...





అక్షర విజేత కోటనందూరు.

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం తుని సబ్ జైలు వద్ద హిందూ స్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన హెూం మంత్రి వంగలపూడి అనిత మరో అతిధి ప్రభుత్వ విఫ్ యనమల దివ్యతో కలిసి ఈ పెట్రోల్ బంక్ ను ప్రారంభించారు. అంతకు ముందు జైలు శాఖ అధికారులు వంగలపూడి అనిత,యనమల దివ్య లకు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన హెూం మంత్రి అనిత జైళ్ళ శాఖలో అనేక మార్పులు తీసుకొచ్చామని, పెట్రోల్ బంక్ లను ఖైదీలే స్వయంగా నిర్వహిస్తారన్నారు. శిక్ష అనుభవిస్తున్న వారిలో పరివర్తనతో బయటకు రావాలన్న ఉద్దేశం తో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈకార్యక్రమంలో

డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అంజనీ కుమార్, జిల్లా ఎస్పీ బింధుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



# పేటలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం ప్రారంభం

**ప్రజలతో మమేకమైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**

అక్షర విజేత చిలకలూరిపేట

చిలకలూరిపేట నియోజకవర్గంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం పండుగ వాతావరణంలో, ప్రజల ఉత్సాహం మధ్య ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం పట్టణంలోని 13, 14, 17 వార్డుల్లో విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు స్వయంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రజల వద్దకు వెళ్లి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరంగా వివరించారు. ఇచ్చిన మాట ప్రకారం రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని తెలుసుకోవడానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఇంటింటికీ వెళ్లి ప్రజలను, ముఖ్యంగా వృద్ధులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నెలవారీ వృద్ధాప్య పింఛన్లు, తల్లికి వందనం వంటి పథకాలు అందుతున్నాయా అని మహిళలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా పథకాలు ఏ విధంగా అమలు చేశారనే వివరాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించారు. అలాగే, ఆగస్టులో అమలు చేయనున్న ఉచిత బస్సు ప్రయాణం, మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలపై "సుపరిపాలన" ద్వారా ఇంటింటికి తిరిగి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం మంచి పథకాలను అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ



పాలనను "రాక్షస పాలన"గా అభివర్ణించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు.

# కే ఓ అగ్రహారం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు

## - కార్యక్రమం ప్రారంభించిన ప్రభుత్వ విప్ దివ్య....





అక్షర విజేత కోటనందూరు.

కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం కోటనందూరు మండలం ఫస్ట్ వచ్చిందంటే తలుపు తట్టి తెల్లారికే పెన్షన్ ఇస్తున్నారంటూ పింఛన్ దారులు....ఉచిత గ్యాస్ సిలెండర్లు పథకం కింద... అకౌంట్లో నగదు బదిలీ భేష్ భేష్...తల్లికి వందనం డబ్బులు అందాయని మురిసిపోయిన విద్యార్థుల తల్లులు... సూపర్ సిక్స్ పథకాలు ఆర్థిక వెతలు లేని సుఖమయిమైన జీవనంతో ఇంటిల్లిపాది హ్యాపీ హ్యాపీ...ఈమాటలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ప్రతిధ్వనించాయి. సీనియర్ నేత గాడి రాజబాబు ఆధ్వర్యంలో కోటనందూరు మండలం కేవో అగ్రహారం నుంచి ప్రభుత్వ విఫ్ యనమల దివ్య, సీనియర్ నేత యనమల రాజేష్ తో కలిసి ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓవైపు ఎడతెరిపి ఇవ్వని వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామానికి విచ్చేసిన అభిమాన నేత్రికి గ్రామనాయకులు ఎలమంచిలి చిట్టిబాబు, బంగారు అప్పలనాయుడు మిరియాల సత్యనారాయణ, మిరియాల సత్యనారాయణ చిట్టిమూరి శివ కాపారపు లక్ష్మణ్, కొల్లు పెద్దబ్బాయి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు అనంతరం ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే యనమల దివ్య చంద్రబాబు సుపరిపాలన లో తొలి అడుగు వేసిందని సూపర్ సిక్స్ పథకాలు పేదల దరికి చేర్చామని వివరించారు ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ప్రజా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నేత చింతంనీడి అబ్బాయి మండల టిడిపి అధ్యక్షుడు పోతల సూరిబాబు మార్కెట్ కమిటీ చైర్మన్ అంకం రెడ్డి రమేష్, సీనియర్ నాయకులు పెంటకోట భాస్కర్ సత్యనారాయణ షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు మరియు పల్నాడు జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం తాడేపల్లిలోని శ్రీ ఫార్చ్యూన్ గ్రాండ్ హెూటల్ నందు నిర్వహించారు.

అక్షర విజేత తాడేపల్లి:

ముఖ్యఅతిథిగా విచ్చేసిన రీజనల్ కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు శ్రీ వైవి సుబ్బారెడ్డి గారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ వై.యస్. జగన్ మోహన్ రెడ్డి గారి సూచనమేరకు రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఎంపీ గారి అధ్యక్షతన "బాబు షూరిటీ - మోసం గ్యారంటీ" అనే కార్యక్రమం ఈరోజు తాడేపల్లి పట్టణంలోని శ్రీ ఫార్చ్యూన్ గ్రాండ్ హెూటల్ లో గుంటూరు, పల్నాడు ఉమ్మడి జిల్లాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు అతిథులుగా హాజరయ్యారు.

జగన్ గారి 35 నిమిషాల వీడియోనుకూడా ప్లే చేశారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ ఏడాది పాలనపై, చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు విస్మరించి పాలన సాగించడం, సంక్షేమ పథకాలు ఎగ్గొట్టి ప్రజలకు ఎంత బకాయిలు పడ్డారనేది, దీనిపై ప్రజలను చైతన్యపరచడంపై విస్తృతస్థాయి సమావేశంలో వివరించారు. మొత్తం నాలుగు దశల్లో రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో%ా%, చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ ప్రతి ఇంటికి వెళ్లాలి అన్నారు కార్యక్రమాన్ని ఎలా చేయాలనేది వివరిస్తూ క్యూఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంట్ రిలీజ్ చేయడంతోపాటు చంద్రబాబు ఇచ్చిన బాండ్లు గురించి, జగనన్న గతంలో ఇచ్చిన పథకాలు ఎలా ఎగరగొడుతున్నారు, అలాగే చంద్రబాబు మోసాల వల్ల నష్టం ఎంత, దీనికి సంబంధించిన ఫార్మాట్‌ను ఎలా నింపాలన్నదానిపై వివరించారు. చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అన్నది ప్రజల్లోకి వెళ్ళాలి. టీడీపీ నాయకులు ప్రజల వద్దకు వచ్చినప్పుడు వారిని నిలదీయాలి అన్నారు జగన్ గారి ప్రభుత్వంలో లబ్ధిపొందిన 1.60 కోట్ల కుటుంబాలు కూటమి నేతలను నిలదీసేలా మనం చైతన్యం కలిగించాలి దీంతోపాటు సాక్షితో పాటు మరికొన్ని చానల్స్ ప్రసారాలు రాకుండా చేసిన దుర్మార్గపు చర్యపై కూడా కేబుల్ ఆపరేటర్‌ను నిలదీసి ఆ ఛానల్స్ ప్రసారాలు అందుబాటులోకి వచ్చేలా చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో పెద్దలు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు గారు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి గారు, పట్టణ, రూరల్ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమి రెడ్డి, అమర నాగేశ్వరరావు, ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, శివ గోపయ్య గార్లతోపాటు రాష్ట్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, మున్సిపల్ చైర్ పర్సన్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు సమావేశంలో పాల్గొన్నారు.







# ప్రభుత్వ విద్య బలోపేతం కోసం ఉపాధ్యాయులపై పవిత్ర బాధ్యత ఉంది



**ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నాం- ఇకపై విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృష్టిపెడతాం**

**ఉండవల్లి నివాసంలో 'షైనింగ్ టీచర్' ను ఘనంగా సత్కరించిన మంత్రి లోకేష్**

**విద్యార్థిగా మారి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సలహాలు, సూచనలు స్వీకరణ**

అక్షర విజేత ఉండవల్లిః
ప్రభుత్వ విద్య బలోపేతం కోసం ఉపాధ్యాయులపై పవిత్ర బాధ్యత ఉంది, విద్యాశాఖలో మొదటి ఏడాది సంస్కరణలు పూర్తయ్యాయి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నాం, ఇకపై విద్యార్థుల అభ్యసన ఫలితాలపై దృషిసారిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కర్నూలు జిల్లా పత్తికొండ మండలం మారుమూల గిరిజన గ్రామం జేఎం తండాలోని ప్రభుత్వ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలలో వృత్తిపట్ల అంకింతభావం చూపి అద్భుత ఫలితాలు సాధిస్తున్న ఉపాధ్యాయురాలు శ్రీమతి ఎం.కల్యాణి కుమారిని కుటుంబంతో సహా ఉండవల్లి నివాసానికి పిలిపించుకుని మంత్రి నారా లోకేష్ 'షైనింగ్ టీచర్' పేరుతో ఘనంగా సత్కరించారు.

**విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారు**

2017లో జేఎం తండా మండల పరిషత్ ఏకోపాధ్యాయ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయురాలు కల్యాణి తన అంకితభావంతో పాఠశాల రూపురేఖలు మార్చి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులందరికీ ఆమె ఆదర్శంగా నిలిచారు. తాను బాధ్యతలు చేపట్టేనాటికి పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు కేవలం 14 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా అందులో ఇద్దరు మాత్రమే క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేవారు. ఒకానొక దశలో పాఠశాలను మూసివేయాలని భావించారు. ఉపాధ్యాయురాలిగా ఆమె బాధ్యతలు చేపట్టిన తర్వాత సొంత నిధులతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించడంతో పాటు పాఠశాలలో మౌలికసదుపాయాల కల్పనకు కృషిచేశారు. తన పనితీరుతో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించారు. దీంతో 2020-21 విద్యాసంవత్సరానికి విద్యార్థుల సంఖ్య 53 కి పెరిగింది. పొరుగు గ్రామాల నుంచి కూడా విద్యార్థులు చేరడం ప్రారంభించారు. ఇక్కడ విద్యనభ్యసించిన వారిలో 23 మంది విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశం పొందగా, ఒకరికి ప్రతిష్టాత్మక నవోదయ పాఠశాలలో ప్రవేశం లభించింది. ప్రస్తుతం పాఠశాలలో 43 మంది విద్యార్థులు ఉన్నారు.

**విద్యార్థిగా మారిన విద్యాశాఖ మంత్రి**

షైనింగ్ టీచర్ తో సమావేశం సందర్భంగా విద్యార్థిగా మారిన విద్యశాఖ మంత్రి నారా లోకేష్.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై ఉపాధ్యాయురాలి నుంచి ఎంతో హుందాగా సలహాలు సూచనలు స్వీకరించారు. వాటిని ఆచరణలో పెడతామని హామీ ఇచ్చారు. పట్టుదలతో స్కూల్ ను అద్భుతంగా తీర్చిదిద్దారని అభినందించారు. సింగిల్ టీచర్ గా ఉండి పెద్దసంఖ్యలో అడ్మిషన్లు తీసుకురావడం చరిత్ర అని ప్రశంసించారు. మీ నుంచి ఎంతో నేర్చుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు కల్యాణి మాట్లాడుతూ.. నా వద్ద చదువుకునే విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఆశయంతో పనిచేశాను. ప్రభుత్వ పాఠశాలలో కూడా మంచి విద్య లభిస్తుందనే నమ్మకం తల్లిదండ్రుల్లో కల్పించాలి. స్టార్ ఆప్ ది వీక్ పేరుతో ప్రతి సోమవారం హెూం వర్క్, హాజరు, క్రమశిక్షణ, ప్రేయర్, హ్యాండ్ రైటింగ్, వ్యక్తిగత పరిశుభ్రత యూనిఫాంలో అత్యుత్తమంగా నిలిచిన విద్యార్థికి బహుమతి అందజేస్తాను. వారి ప్రోగ్రెస్ ను నిరంతరం పర్యవేక్షిస్తాను. 'దీర్ఘాయుష్మాన్ భవ' పేరుతో విద్యార్థుల పుట్టినరోజు నాడు వ్యక్తిగత పరిశుభ్రత తెలియజేసేలా టీచర్ కు సబ్బు ప్రదానం చేసే సంస్కృతి తీసుకువచ్చాం. పేద విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉండేందుకు 'మా తొలి అడుగు' పేరుతో వారికి అవసరమైన పలక, బలపం, పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేస్తాం. ఎవరైనా స్కూల్ కు సెలవు పెట్టాలంటే ముందుగా అనుమతి తీసుకోవాలి. నేను సెలవు పెట్టాలన్నా అనుమతి తీసుకుంటాను. పిల్లలు బాగా చదవకపోతే తల్లిదండ్రులతో ఫోన్ లో మాట్లాడతాను. ప్రతి రోజూ హెూంవర్క్ ఇస్తాను. చిన్న పిల్లలకు ఫ్రూట్స్, వెజిటబుల్స్ ఫోటోల ప్రదర్శన ద్వారా వారిలో చదువు పట్ల ఆసక్తి కలిగిస్తానని వివరించారు. మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ వల్ల ఎంతో ప్రయోజనం ఉందని, ఏకోపాధ్యాయ పాఠశాలలకు అదనంగా మరో టీచర్ ను కేటాయించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు.



**ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం సీరియస్ గా ఉందని తెలియాలి**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో 9,600 పాఠశాలలకు తరగతికో ఉపాధ్యాయుడు ఉన్నారు. భవిష్యత్ లో మరింత మెరుగుపరుస్తాం. విద్యార్థులకు హెూంవర్క్ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం. స్టార్ ఆఫ్ ది వీక్ ఆలోచన బాగుంది. డిజిటల్ విద్యకు ప్రాధాన్యత ఇస్తాం. ఇప్పటికే మెగా పీటీఎం నిర్వహణతో పాటు మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం అందిస్తున్నాం. నిజానికి ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుంది. ఇక్కడే క్వాలిఫైడ్ టీచర్లు ఉంటారు. పట్టుదల ఉంటుంది. విద్యార్థులకు వర్క్ బుక్స్, రాజ్యాంగంపై చిన్నవయసులోనే అవగాహన కలిగించేలా చర్యలు తీసుకున్నాం. ముందు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు గారు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు, మంత్రులు దృష్టిసారిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం సీరియస్ గా ఉందని తెలియాలి. డీఎస్సీ పై 30 కేసులు వేశారు. అన్నింటినీ దాటుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. సమాజంలోనూ మార్పురావాలని, విద్య ద్వారానే ఉన్నతస్థాయికి వెళ్తామన్నారు. ఇకపై ఉత్తమ ఉపాధ్యాయులను కలిసి సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి స్వయంగా కలిసి సత్కరించడం పట్ల ఉపాధ్యాయురాలు కల్యాణి కుమారి హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజలలో విశ్వాసం పెంచే విధంగా వైద్యులు, వైద్య సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేయాలి

**సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఏ ఒక్క మరణం కూడా సంభవించకూడదు**

**జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తో సమీక్ష**

అక్షరవిజేత., ఏలూరు:-
పేదప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వైద్యులు, వైద్య సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో చైర్ పర్సన్ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ తో కలిసి సమీక్షించారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, ఆసుపత్రి వైద్యాధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం ద్వారా ఉత్తమ ఆసుపత్రిగా తీర్చిదిద్దెందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసుపత్రిలో కార్డియాలజీ విభాగం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, అల్ట్రాసౌండ్ స్కానింగ్, 2డి ఎకో వంటి రేడియాలజీ విభాగంలో వైద్యుల నియామకం చేపట్టాలని అంతవరకూ ప్రజల సేవలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక విధానంలో వైద్యుల సేవలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రజలకు వైద్య సేవలందించే విషయంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు.

ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలో పేదలకు మెరుగైన సేవలందేలా వైద్యులు, వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి అత్యవసర పరిస్థితిలో రోగులు వస్తుంటారని, వారికి వెంటనే చికిత్స అందేలా వైద్య సిబ్బంది పనిచేయాలన్నారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, వైద్య సేవల లోపం కారణంగా ఎటువంటి మరణం సంబవించకుండా డాక్టర్లు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏ ఒక్క పేదవాడు తనకు వైద్య సేవలు అందలేదని ఫిర్యాదు చేయకుండా వైద్యాధికారులు రోగులకు సేవలందించాలన్నారు. సదరం లో నమోదు చేసుకున్న వారికి వెంటనే ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా మెడికల్ రేయింబర్సమెంట్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆసుపత్రిలో, ఆవరణలో, టాయిలెట్ లలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పరిస్థితులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏలూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు మరిన్ని సౌకర్యాలు అందించేందుకు ప్రజాప్రతినిధులుగా తాము పూర్తి సహకారం అందిస్తామని, వైద్య సేవలలో జిల్లా ఆసుపత్రిని జిల్లాలోనే ఉన్నతంగా తీర్చిదిద్దెందుకు సహాయ, సహకారాలు అందిస్తామని, అదే



సమయంలో రోగులకు సక్రమంగా వైద్య సేవలందించడంలో వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు.

దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ప్రసూతి విభాగంలో మరిన్ని బెడ్స్ పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర సమయంలో రోగులను విజయవాడ వంటి ప్రదేశాలకు తరలించేందుకు ఆసుపత్రిలో అంబులెన్స్ లు అందుబాటులో లేవని, అంబులెన్సులు 24 గంటల పాటు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితులలో అల్ట్రాసౌండ్ స్కానింగ్, గుండె జబ్బులకు 2డి ఎకో స్కానింగ్ చేసేందుకు డాక్టర్లు అందుబాటులో లేరని, రేడియాలజిస్ట్ పోస్టు భర్తీ చేయాలనీ కోరారు.
సమావేశంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శశిధర్, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయాధికారి డా. పాల్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. మాలిని, రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు శాఖ చైర్మన్ డా. ఎం.బి.ఎస్. వి., ప్రసాద్, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆసుపత్రిలోని వివిధ విభాగాల వైద్యాధికారులు, ప్రభృతులు పాల్గొన్నారు



# ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ ను కలిసిన సొసైటీ అధ్యక్షురాలు దుర్గా మాధురి.

అక్షర విజేత / బుట్టాయగూడెం.
కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు వ్యవసాయ పరపతి సహకార సంఘం అధ్యక్షురాలుగా యనమదుల దుర్గా మాధురి బాధ్యతలు స్వీకరించిన తరువాత మొట్ట మొదటిసారిగా ఏలూరు లోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ



సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిప్పకాయలపాడు సొసైటీకి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎంపీ తెలిపారని ఆమె అన్నారు. తనను దిప్పకాయలపాడు సొసైటీ అధ్యక్షులుగా ఎంపిక చేసిన ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ కు , తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు దుర్గా మాధురి ధన్యవాదాలు తెలియజేశారు.

# పోశమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు





అక్షర విజేత, దేవీపట్నం :
దేవీపట్నం మండలం గొందూరులోని శ్రీ గండి పోశమ్మఆలయంలో హుండీ లెక్కింపు బుధవారం ఆకస్మికంగాచేపట్టారు. రూ. 1.02లక్షలు ఆదాయం వచ్చిందనిఆలయ ఈవో లక్ష్మి కుమార్ తెలిపారు. గోదావరికివరద పెరగడం, ఆలయ సమీపంలో వరద నీరుప్రవహించడంతో ఈ నిర్ణయంతీసుకున్నామన్నారు.వరద మరింత పెరిగి ఆలయం లోపలకు నీరు వచ్చేఅవకాశం కనిపిస్తుందని సిబ్బంది పేర్కొన్నారు. భక్తులుతగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

# చిలకలూరిపేట నుండి నరసరావుపేట వెళ్లే రహదారిలో తనిఖీ

చిలకలూరిపేట:మూడు విభాగాల అధికారులు సంయుక్తంగా విస్తృత వాహన తనిఖీలు నిర్వహించారు. బ్రేక్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ రావు ఆధ్వర్యంలో స్కూల్ బస్సులతో పాటు ఇతర వాహనాలను చిలకలూరిపేట నుండి నరసరావుపేట వెళ్లే రహదారిలో తనిఖీ చేశారు.
ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 30 వాహనాలను పరిశీలించగా, 12 వాహనాలపై కేసులు నమోదు చేసి, ?47,200 జరిమానా విధించారు.
నమోదు చేసిన కేసుల వివరాలు
- ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేనివి: 2 -డ్రైవర్ యూనిఫాం లేనివి: 3
- ఫస్ట్ ఎయిడ్ కిట్ లేనివి: 3
- ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేనివి: 1- పర్మిట్ లేనివి: 1
- డ్రైవింగ్ లైసెన్స్ లేనివి: 1

-పొల్యూషన్ సర్టిఫికెట్ లేని వాహనాలపై, పన్ను చెల్లించని వాహనాలపై, అలాగే హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిపై కూడా కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని సరైన పత్రాలను వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు

# కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో నరేంద్ర మోడీ

**-ఈనెల 6వ తేదీన జరిగే సిపిఐ పట్టణ 26వ మహాసభను జయప్రదం చేయండి**

**-దేశవ్యాప్తంగా 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి**

**-సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పిలుపు**

అక్షర విజేత మంగళగిరి:
కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో నరేంద్ర మోడీ సర్కార్ పయనిస్తుందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య విమర్శించారు. బుధవారం మంగళగిరి పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయం వేములపల్లి శ్రీకృష్ణ భవన్ లో పట్టణ కౌన్సిల్ సమావేశం సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశం కు ముఖ్యఅతిథిగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య హాజరై తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ నరేంద్ర మోడీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం దేశ ఆర్థిక పారిశ్రామిక వ్యవస్థలను గుజరాత్ కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 100 రోజుల్లో ధరలు తగ్గిస్తానని చెప్పి సంవత్సరం గడుస్తున్నా ధరలు తగ్గించలేదని నరేంద్ర మోడీ మాటలు నీటి మూటలు అయ్యాయని ఆయన అన్నారు.నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 11 సంవత్సరాల నరేంద్ర మోడీ అధికారంలో కార్పొరేట్ సంస్థలకు దేశ సంపద దోచుపెట్టారే తప్ప దేశానికి చేసిందేమీ లేదని తిరుపతయ్య మండిపడ్డారు. నరేంద్ర మోడీ విధానాలను రాష్ట్రంలో అమలు జరుపుతున్నందు వల్ల విద్యుత్ ఛార్జీల భారం నానాటికి పెరుగుతుందని ఆయన విమర్శించారు. ఈనెల ఆరో తేదీన ఉదయం 10 గంటలకు వేములపల్లి శ్రీకృష్ణ భవన్ లో సిపిఐ పట్టణ 26వ మహాసభ జరుగుతున్నది సభను జయప్రదం చేయాలని చిన్ని తిరుపతయ్య పిలుపునిచ్చారు. సిపిఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ మాట్లాడుతూ నరేంద్ర మోడీ విధివిధానాల వలన దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేంద్ర మోడీ అధికారం చేపట్టిన తర్వాత మత విద్వేషాలు రగులుస్తూ కులాలు, మతాలు మధ్య విద్వేషాలు సృష్టిస్తూ మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయాలని చూస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్మిక వ్యతిరేక విధానాలను అమలుపరుస్తూ కార్మికులను పెట్టుబడిదారులకు దాసోహం అనేలా వారి శ్రమను దోచుకునే విధంగా కార్మిక చట్టాలను మారుస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో పోరాటాలు బలిదానాలు చేసి సాధించి పెట్టుకున్న కార్మిక హక్కులను కాలరాస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కార్మికులంతా ఏకమై ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ఆయన అన్నారు. అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లతో మరో దోపిడీ వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వం తెర లేపిందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన అన్నారు. ఈనెల ఆరవ తేదీన జరగబోయే పట్టణ 26వ మహాసభను జయప్రదం చేయాలని, అదేవిధంగా ఈ నెల 9వ తేదీన జరగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అన్నవరపు ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ నాలుగో వార్డు శాఖ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, గండికోట దుర్గారావు, ఆకురాతి శ్రీనివాసరావు, బత్తూరి మోహనరావు, ఉయ్యాల సత్యనారాయణ, దొడ్డి ఈశ్వరరావు, వల్లభాపురం సాంబశివరావు, గంజి శ్రీనివాసరావు, బేగ్, గోహార్ జానీ తదితరులు పాల్గొన్నారు.



# తిమ్మాపురం జాతీయ రహదారిపై యడ్లపాడు పోలీసుల విస్తృత తనిఖీలు

అక్షర విజేత ఎడ్లపాడు
ఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు, యడ్లపాడు ఎస్ఐ శివ రామకృష్ణ ఆధ్వర్యంలో తిమ్మాపురం జాతీయ రహదారిపై పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ శివ రామకృష్ణ తన బృందంతో కలిసి అనుమానాస్పద వాహనాలను ఆపి, క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివ రామకృష్ణ మాట్లాడుతూ, అనుమతి లేకుండా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణాకు పాల్పడే వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. అలాగే, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్డు భద్రతను నిర్ధారించడానికి మరియు అక్రమ కార్యకలాపాలను అరికట్టడానికి ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు.



# పేకాట స్థావరంపై దాడి

**- 10మంది వ్యక్తులు అరెస్టు, రూ.10,38,000/- నగదు,11 సెల్ ఫోన్లు మరియు 1బైక్ స్వాధీనం.**



అక్షర విజేత పల్నాడు జిల్లా
పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఐపిఎస్ఆదేశాల మేరకు ఈరోజు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో అమరావతి గ్రామంలోఎస్ ఆర్ ఆర్ లాడ్జి నందు 206 నెంబర్ గది నందు పేకాట ఆడుతున్న వారిని తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించిన అమరావతి సి.ఐ వై అచ్చయ్య ,పేకాట ఆడుచున్న 10మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి 10,38,000/- నగదు, మరియు 11 సెల్ ఫోన్ లు,1బైక్ స్వాధీనం చేసుకోవడం జరిగినది. అమరావతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎస్పీ ఆదేశాల మేరకు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని
సి.ఐ వై అచ్చయ్య హెచ్చరించారు.

## జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన పుట్టా మౌళ్య

విజయవాడ,ఐ: విజయవాడ నగరానికి చెందిన పొట్ట మౌల్య ఇటీవల ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ హాల్లో నిర్వహించిన తొమ్మిదవ రాష్ట్రస్థాయి అండర్ 10 బాలికల ఫెన్సింగ్ విభాగంలో సత్తా చాటి తృతీయ స్థానంలో నిలిచినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ కుమార్ తెలిపారు. మౌల్య జూలై 5వ తేదీ నుండి ఏడో తేదీ వరకు మహారాష్ట్ర రాష్ట్రంలోని నాసిక్ పట్టణంలో జరగబోయే తొమ్మిదవ జాతీయ బాలికల ఫెన్సింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకి ప్రాతినిధ్యం వహించనుందని చెప్పారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ మౌల్య అతి చిన్న వయసులోనే కత్తి క్రీడలో ప్రావీణ్యం పొందిందని భవిష్యత్తులో తప్పకుండా ఉత్తమ క్రీడాకారిణిగా ఎదుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పొట్ట మౌల్యని జిల్లాలోని పలువురు క్రీడా ప్రముఖులు, క్రీడా సంఘ నాయకులు అభినందించారు.

# విధ్వంసం నుంచి వికాసం వైపుగా అడుగులు వేస్తున్నాం

**-ఏపీ ట్రై కార్ చైర్మన్ బొరగం.**



అక్షర విజేత / బుట్టాయిగూడెం.
బుట్టాయగూడెం మండలం బూసరాజు పల్లిలో తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయం నందు సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ మరియు పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జి బొరగం శ్రీనివాసులు నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి ఆవిష్కరణ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని , ప్రతి కార్యకర్త మరియు నాయకులు కూటమి ప్రభుత్వము ఈ ఏడాది కాలముగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలియజేశారు. తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి 15 వేలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, వృద్ధులు, వితంతువులకు 4 వేలు, దివ్యాంగులకు 6 వేలు, కిడ్నీ, కాలేయం, తలసిమియా బాధితులకు 10 వేలు, పూర్తి వైకల్యం ఉన్నవారికి 15 వేలు, పోలీస్ శాఖలో నియామకాలు, 16,347 డీఎస్సీ ఉద్యోగాలు ,దీపం పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పైదవారి గూడెం లో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం జరిగింది. ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చి ప్రజలను ఆర్థికంగా ముందంజలో ఉంచడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయటంతో పాటుగా ఉపాధి కల్పన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయటం జరుగుతుందని బొరగం శ్రీనివాస్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సొంబాబు, పారేపల్లి నరేష్,బొడ్డు కృష్ణ, జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యంట్రప్రగడ శ్రీనివాస్, ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు మడకం రామకృష్ణ, ఏలూరు జిల్లా





టెలికాం అడ్వైజరీ డైరెక్టర్ షేక్ సుభాని, ఆకుల అరుణ,చింతల వెంకటరమణ, పెండ్యాల రమాదేవి, పోలవరం మండల వాణిజ్య విభాగం అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, పైదా వసంతరావు పాల్గొన్నారు.

# తాడేపల్లిలో సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లోకేష్

**-ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన మంత్రి**

**-రీటైనింగ్ వాల్ నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభానికి అధికారులకు ఆదేశం**

**-పలు సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చిన స్థానికులు-పరిష్కరించి అండగా ఉంటామని మంత్రి లోకేష్ భరోసా**

అక్షర విజేత తాడేపల్లిః
కూటమి ప్రభుత్వ ఏడాది పాలనను పురస్కరించుకుని మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని మహానాడు కాలనీలో నిర్వహించిన సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. మంత్రి నారా లోకేష్ రాక నేపథ్యంలో ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ మంత్రి ముందుకు సాగారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. రీటైనింగ్ వాల్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి.. నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు మహానాడు కాలనీ ఒకటవ రోడ్డుకు చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు.



**బీసీ సామాజికవర్గం వ్యక్తి ఇంటికి వెళ్లి ఆరా తీసిన మంత్రి లోకేష్**

కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బీసీ సామాజికవర్గానికి చెందిన వెదుళ్ల మధుబాబు ఇంటికి వెళ్లిన మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందాయా అని ప్రశ్నించారు. తమ దశాబ్దాల కల అయిన ఇంటి పట్టా అందించారని, రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నామని ఈ సందర్భంగా మధుబాబు కుటుంబ సభ్యులు మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు తెలిపారు. ఇంటి పట్టా కోసం తాము ఎక్కడికీ తిరగలేదని, బస్సులు పెట్టి మరీ తమను తీసుకెళ్లారని, భోజనంతో పాటు బట్టలు పెట్టి ఇంటి పట్టా అందించారని చెప్పారు. ఇంటర్ చదువుతున్న తమ కుమార్తెకు తల్లికి వందనం సాయం అందిందని, దీపం పథకం కింద గ్యాస్ సబ్సీడీ నగదు బ్యాక్ అకౌంట్ లో జమ అయిందన్నారు. తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. కుమారుడు ఇంటర్ పూర్తిచేశాడని, త్వరలోనే ఇంజనీరింగ్ లో చేరుస్తామని తెలిపారు. పిల్లలు బాగా చదువుకోవాలని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ వారికి చెప్పారు.

**1.ఇంటి పట్టాల గురించి గతంలో ఎవరూ పట్టించుకోలేదు**
**యాపతి లక్ష్మి, మహానాడు కాలనీ, తాడేపల్లి**

నా కుమారుడికి తల్లికి వందనం పథకం కింద సాయం అందింది. మేం నివసిస్తున్న ఇంటికి పట్టా ఇచ్చారు. ఇన్నేళ్లలో ఎప్పుడూ పట్టించుకోలేదు. గ్యాస్ సబ్సీడీ నగదు కూడా అందింది. మా నాన్న గారికి వృద్ధాప్య పెన్షన్ ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో గంజాయి నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. గతంలో కంటే గంజాయి వినియోగం బాగా తగ్గింది. రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని మంత్రి లోకేష్ గారు హామీ ఇచ్చారు.



**2.రిటైనింగ్ వాల్ నిర్మించాలి**
**షేక్ మెహబూబా, మహానాడు కాలనీ, తాడేపల్లి**

ఇంటి పట్టా అందించి మా 40 ఏళ్ల కలను నెరవేర్చారు. మా పిల్లలకు తల్లికి వందనం కింద సాయం అందింది. వరదలు వచ్చినప్పుడు మునిగిపోకుండా రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని మంత్రి లోకేష్ గారు హామీ ఇచ్చారు. మాకు చాలా ఆనందంగా ఉంది.



**3.ఇంటికి పట్టా వచ్చింది, రిజిస్టర్ కూడా చేశారు**
**బొందిలి భాగ్యలక్ష్మి బాయి, మహానాడు కాలనీ, తాడేపల్లి**

నెలనెలా మొదటి తేదీనే ఇంటివద్దకు వచ్చి పెన్షన్ ను అందిస్తున్నారు. గత నెలలో రేషన్ కూడా ఇంటికే తెచ్చి ఇచ్చారు. ఇకపై నెలనెలా ఇంటికే తెచ్చి రేషన్ సరుకులు అందజేస్తామని డీలర్ చెప్పారు. గ్యాస్ సిలిండర్ డబ్బులు పడ్డాయి. మా ఇంటికి పట్టా ఇచ్చారు. చంద్రబాబు గారి పాలన బాగుంది. మళ్ళీ మళ్ళీ నారా లోకేష్ గారే ఎమ్మెల్యేగా గెలవాలని కోరుకుంటున్నాను.